సాక్షి తిరుపతి

శనివారం । 9 । ఆగస్టు । 2025



హాస్టళ్లలో మంత్రి తనిఖీ

మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. - 8లో



పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

నాగలాపురం మండలంలోని ఓ కుటుంబం వివాహానికి హాజరై తిరిగివచ్చేసరికి నగలు, నగదు దోచేశారు. - 8లో



చేపల వాహనం పట్టివేత

మత్స్యశాఖ అధికారులు విధించిన నిషేధాన్ని వ్యతిరేకించి దుండగులు చేపలను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

పులివెందుల ఘటన అరాచకానికి పరాకాష్ట



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం) : కూటమి అరాచక పాలనకు హద్దు లేకుండా పోతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్ కడప జిల్లా ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నేత వేల్పుల రాముపై టీడీపీ గూండాలు దాడి చేసిన ఘటన చూస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నామా..? లేక వేరే దేశంలో ఉన్నామా? అని ప్రశ్నించారు. టీడీపీ పరాకాష్టకు ప్రజాస్వామ్యంలో ప్రజలు బతికిబట్టకట్టడం కష్టతరంగా మారిందన్నారు. శాసన మండలి సభ్యుడికే పోలీసులు ఎటువంటి రక్షణ ఇవ్వకపోవడంపై సామాన్యుడి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ ప్రజలను భయాందోళనకు గురిచేసి గెలవాలనుకోవడం హేయమైన చర్య అన్నారు. అధికార మదంతో ఎల్లో సైకో బ్యాచ్ వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్తులో స్వేచ్ఛాయుత ఎన్నికలకు గొడ్డలిపెట్టుగా మారుతోందన్నారు. ఎన్నికల కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు చేపట్టాలని, దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని రామ్‌కుమార్‌రెడ్డి డిమాండు చేశారు.

9,11 తేదీల్లో చెన్నై మెమో రద్దు

నాయుడుపేటటౌన్ : చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే మెమో రైలు ఈనెల 9, 11 తేదీలలో రాకపోకలు పూర్తిగా రద్దు చేసినట్లు రైల్వేస్టేషన్ మేనేజర్ చిరంజీవి శుక్రవారం తెలిపారు. పలు ప్రాంతాల్లో రైల్వే లైన్ల మరమ్మతుల కారణంగా మెమో రైలు రద్దు చేసినట్లు రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించినట్లు రైల్వేస్టేషన్ మేనేజర్ వెల్లడించారు.

23న జాతీయ అంతరిక్ష దినోత్సవం



జాతీయ స్పేస్ దినోత్సవానికి సంబంధించిన చిత్రమిది

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌తో పాటు దేశంలోని ఇస్రో సెంటర్‌లలో ఈనెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకునేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తోంది. 2023 జులై 14న చంద్రయాన్-3 ప్రయోగాన్ని నిర్వహించి ఆగస్టు 23న ల్యాండర్‌ను చంద్రుడి ఉపరి తలంపై దక్షిణ ధృవం ప్రాంతంలో దించి చరిత్ర సృష్టించడంతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆ రోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా 2024 జులై 23న ప్రకటించి గత ఏడాది జులై 23 నుంచి ఆగస్టు 23 దాకా జాతీయ అంతరిక్ష దినోత్సవాలను దేశంలోని అన్ని ఇస్రో కేంద్రాల్లో నెలపాటు జరుపుకున్నారు. అంటే మొట్ట మొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ఈ ఏడాది రెండో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రీమూలస్థాన ఎల్లమ్మ పాలక మండలికి దరఖాస్తులు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ దేవాదాయ శాఖ అధికారులు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ నుంచి 20 రోజుల లోపు దేవాదాయ ధర్మదాయశాఖ జిల్లా కార్యాలయంలో నేరుగా కానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్ కాపీ, రెండు పాసుపోర్టు సైజ్ ఫొటోలు, అఫిడవిట్ జతపరచాలని పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ నారాయణగిరి షెడ్ల వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 65,234 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,133 మంది భక్తులు తలనీలాలు ఇచ్చారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.80 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

• స్వర్ణ రథంపై సిరుల తల్లి



తిరుచానూరులో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. అమ్మవారు బంగారు చీరతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోత్తర శత నామావళి నిర్వహించారు. సాయంత్రం స్వర్ణరథంపై విహరిస్తూ కనువిందు చేశారు. - చంద్రగిరి

• వరలక్ష్మీ కటాక్షం



శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలోని బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో మహిళలు పెద్దసంఖ్యలో నోములు నోచుకున్నారు. - శ్రీకాళహస్తి

• ఆదిలక్ష్మి అనుగ్రహం



రాపూరు : పెంచలకోనలో శుక్రవారం ఆదిలక్ష్మీదేవికి భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని పద్మ పీఠంపై కొలువుతీర్చి మహిళల చేత అర్చకులు వ్రతం చేయించారు. - రాపూరు

అంగన్‌వాడీలతో సెల్‌గాటం!

అంగన్‌వాడీ కార్యకర్తలతో కూటమి ప్రభుత్వం సెల్‌గాటమాడుతోంది. పాతతరం ఫోన్లు ఇచ్చి అప్లోడ్ చేయాలని కార్యకర్తలను వేధింపులకు గురిచేయడంపై వారు మండిపడుతున్నారు. ప్రతి పనికి యాప్‌లు ఉపయోగించాల్సిన పరిస్థితుల్లో పాత ఫోన్లు వాటిని సపోర్టు చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఈ విషయాలను అధికారులకు చెప్పినా వినకుండా చేయాల్సిందే అంటూ పదే పదే ఒత్తిళ్లు చేయడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు జిల్లా అంతటా నిరసనలు , ధర్నాలు చేపట్టినా అధికారులు మొండిపట్టు వీడకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.



శ్రీకాళహస్తి ప్రాజెక్టు వద్ద ఉద్యోగుల ధర్నా



పిచ్చాటూరు ప్రాజెక్టు వద్ద ఉద్యోగుల ధర్నా

- పనిచేయని మొబైల్స్
- పెరిగిపోతున్న యాప్స్ భారం
- కొత్త యాప్‌లకు సపోర్ట్ చేయని పాత ఫోన్లు
- ఈ ఫోన్లు మాకొద్దంటూ జిల్లా వ్యాప్తంగా ధర్నాలు
- నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోని సర్కార్
- ఐసీడీఎస్ కార్యాలయాల్లో ఫోన్లు అప్పగించే యత్నం

తిరుపతి అర్బన్ : పాత ఫోన్లతో కొత్త యాప్స్‌ను అప్లోడ్ చేయలేకపోవడంతో అంగన్‌వాడీ వర్కర్లు అవస్థలు పడుతున్నారు. అయితే వారి కష్టాలకు పరిష్కారం చూపకుండా టార్గెట్లు ఇచ్చి పనిభారాన్ని పెంచడంతో మహిళా ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఫోన్లు మాకొద్దు బాబోయ్...5 జీ ఫోన్లు ఇవ్వండి అంటూ నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా 11 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వర్కర్లు ధర్నాలు, నిరసనలు తెలుపుతున్నారు. కానీ సమస్యకు పరిష్కారం చూపకుండా కక్ష్య పూరితంగా వ్యవహరించడంపై పలువురు మండిపడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదనపు భారంతో అవస్థలకు గురి చేయడంపై పలువురు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. యాప్‌లు సపోర్టు చేసే ఫోన్‌లు అందించకుండా ఒత్తిళ్లు చేయడంపై ఆవేదన చెందుతున్నారు.

పనిచేయని పాత ఫోన్లు

అంగన్‌వాడీ వర్కర్లుకు ఇచ్చిన యాప్స్ ప్రకారం ముందుగా యాప్‌లో ఫేస్ క్యాప్చర్ అయితేనే అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు ఆహారం అందించాలి. ఈ క్రమంలో లబ్ధిదారులకు ముఖఆధారిత గుర్తింపులో అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో కుటుంబంలో ఎవరూ వచ్చినా రేషన్ ఇచ్చేవారు. అయితే కూటమి సర్కారులో లబ్ధిదారుడు తప్పనిసరిగా చేర్చారు. ముందే కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌కు ఇచ్చే నిధుల్లో కోత విధిస్తోంది. ఈ క్రమంలో అరకొర వసతులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో నడవాల్సి వస్తోంది. దీనికి తోడు యాప్‌ల మోత మరింత భారంగా మారుతుంది. మరోవైపు సిగ్నల్స్ సరిగా లేక, సర్వర్ పనిచేయక తిప్పలు పడుతుంటే.. ఇదిచాలదంటూ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

జిల్లా సమాచారం

అంగన్‌వాడీ పాఠశాలలు	మెయిన్ అంగన్ వాడీ టీచర్లు
2,492	2,066
మినీ అంగన్‌వాడీ టీచర్లు	**హెల్పర్లు**
348	2,066
గర్భిణులు	**బాలింతలు**
10,149	5,818
పిల్లలు 1,46,669	

ఇక పిల్లలకు చదువు ఎప్పుడు ?

అంగన్‌వాడీ కార్యకర్తలు చదివిదింది పదో తరగతి. అయితే ఇంజినీరింగ్ విద్యార్థులు చేసే పరిజ్ఞానానికి చెందిన యాప్స్ ఇస్తే ఎలా చేయడం సాధ్యమంటూ పలువురు మండి పడుతున్నారు. ప్రతి లబ్ధిదారుడి ఫేస్ క్యాప్చర్ చేయాల్సి ఉంది. ఒక్కో కేంద్రంలో సగటున మూడేళ్లలోపు పిల్లలు 40 మంది ఉంటారు. మరో వైపు గర్భిణులు, బాలింతలు 10కి పైగానే ఉంటారు. అంతే కాకుండా ప్రీ స్కూల్ పిల్లలు 10కి పైగా, కిశోర బాలికలు 15 వరకు ఉంటున్నారు. వీరందరికీ ప్రతినెలా ఈకేవైసీ, ఓటీపీ, ఫేస్ క్యాప్చర్ చేయాలంటే సమయం సరిపోవడం లేదని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. ఇక పిల్లలకు చదువు ఎప్పుడు చెప్పాలంటూ ప్రశ్నిస్తున్నారు.

పనిచేయని ఫోన్లు ఎందుకు ?



“ పనిచేయని ఫోన్లు తీసుకొని వేరే ఫోన్లు ఇవ్వాలని నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేస్తున్నాం. టార్గెట్ల పేరుతో అధికారులు అంగన్‌వాడీ వర్కర్లను ఒత్తిళ్లకు గురి చేయడం సరికాదు. దీంతో వర్కర్లు ఆవేదన చెందుతున్నారు. పాత తరం ఫోన్లతో ఇబ్బందులు పడుతున్నారు. పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం. అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– పద్మలీలా, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు

వెసులుబాటు కల్పించాలి



క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ వర్కర్ల ఇబ్బందులను ముందుగా గుర్తించి... ఆ తర్వాత వెసులుబాటు కల్పించాలి. ప్రధానంగా ఫేస్ క్యాప్చర్‌తో నిమిత్తం లేకుండా మాన్యువల్‌గా రేషన్ ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలి. పలు యాప్‌లతో పాటు లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు ఓటీపీ చెప్పడానికి ఇక్కట్లు పడుతున్నారు.

– వాణిశ్రీ, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా కార్యదర్శి

అప్లోడ్ కావడం లేదు



మాకు అందించిన మొబైల్స్‌లో యాప్స్ అప్లోడ్ కావడం లేదు. మరోవైపు పీడీఎఫ్ ఫైల్స్ ఓపెన్ కావడం లేదు. అంతేకాదు స్వర్ణాంధ్ర యాప్ పనులు చేయమంటున్నారు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. మరోవైపు అధికారులు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలని పదే పదే ఒత్తిడి తెస్తున్నారు. పనిభారం తీవ్రంగా పెరిగిపోతోంది.

– రాజేశ్వరి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి

వెంటనే 5జీ ఫోన్లు ఇవ్వాలి



అంగన్‌వాడీ వర్కర్లకు జాప్యం లేకుండా 5జీ మొబైల్స్ ఇవ్వాలి. పాత ఫోన్లు ఇచ్చి న్యూ వెర్షన్ యాప్‌లను అప్లోడ్ చేయాలంటే ఎలా సాధ్యం. ఇవేవీ పట్టించుకోకుండా ఇబ్బందులు పెడుతున్నారు. ఉన్నతాధికారులు అర్థం చేసుకోవాలి. మాపై కక్ష పూరితంగా వ్యవహరిస్తే ప్రయోజనం ఉండదు.

– సౌజన్య, అంగ్‌వాడీ వర్కర్స్ యూనియన్ శ్రీకాళహస్తి ప్రాజెక్టు అధ్యక్షురాలు

పరిస్థితులను తెలియజేశాం



జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్లు పాత మొబైల్స్‌తో ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర స్థాయి అధికారులకు తెలియజేశాం. ఎప్పటికప్పుడు జిల్లా పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నాం. అంగవాడీ వర్కర్లు ప్రతి అంశాన్ని ఫోన్‌లోని యాప్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంది. దాంతోనే వారి అవసరాన్ని తెలియజేస్తున్నారు. కొత్త ఫోన్లు త్వరలోనే వస్తాయని భావిస్తున్నాం.

– వసంతబాయి, జిల్లా ఐసీడీఎస్ పీడీ

రైతు సేవలకు దూరంగా కేంద్రాలు

- పేరు మార్చి నీరుగార్చే కుట్ర
- కుదింపునకు యత్నాలు



రైతు సేవా కేంద్రం

తిరుపతి అర్బన్ : రైతులు నివాసం ఉంటున్న గ్రామాల్లోనే అన్నదాతలకు అవసరమైన సేవలను అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చారు. దీంతో రైతులు మండల కేంద్రాలకు వెళ్లకుండా తమ గ్రామంలోని ఆర్బీకేల్లో ఈ–క్రాప్ నమోదు, ఈకేవైసీ, ధాన్యం కొనుగోలు, పశువులకు దాణా, ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలతో పాటు వివిధ వ్యవసాయ పరికరాలు , రైతులకు పలు రకాల విత్తనాలు, ఎరువులు రాయితీలతో అందించడంతో పాటు పంటకు పదే పదే వచ్చే తెగుళ్ల నివారణకు సూచనలు సలహాలు ఇచ్చేవారు. ప్రత్యేకంగా కియోస్క్ (డిజిటల్ టచ్ స్క్రీన్) యంత్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇళ్ల వద్దకే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేవారు. అన్నదాతలకు ఎన్నో విధాలుగా సేవలు అందించే ఈ కేంద్రాలను కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా పక్కన పెట్టిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గత ప్రభుత్వం చేసిన మంచిని రూపుమాపాలని..

గత ప్రభుత్వం రైతులకు చేసిన మంచిని రూపుమాపే దిశగా కూటమి సర్కారు వ్యవహరిస్తోందని పలువురు రైతులు మండిపడుతున్నారు. జిల్లాలో 445 రైతు భరోసా కేంద్రాలు గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేయడంతో పాటు వాటిని రేషలైజేషన్ పేరుతో మూడు రైతు సేవా కేంద్రాలను ఒకటిగా మార్పు చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో 691 సచివాలయాలను కూటమి ప్రభుత్వం రేషలైజేషన్ పేరుతో 353 చేసిన సంగతి తెలిసిందే. అదే తరహాలో రైతు సేవా కేంద్రాల తగ్గింపు ఉంటుందని చర్చ సాగుతోంది. 165 కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు లేరు. ఇటీవల అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు కావడానికి ఈకేవైసీ చేయించుకోవాల్సిన సంగతి తెలిసిందే. అయితే 2500 మందికి పైగా రైతులు ఈకేవైసీ చేయించుకోవడానికి వీలు లేకుండా పోయింది. అవసరం అయిన మేరకు అగ్రికల్చర్ అసిసెంట్లు అందుబాటులో లేకపోవడంతోనే సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. క్లస్టర్ల పేరుతో 140 నుంచి 145 రైతు సేవా కేంద్రాలు మాత్రమే ఉండనున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈనెల చివరికి స్పష్టత రానుంది. ఇలా చేస్తే రైతులకు మళ్లీ మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని రైతులు భావిస్తున్నారు.

ముగ్గురు ‘ఎర్ర’ స్మగ్లర్ల అరెస్టు



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, పోలీసుల అదుపులో ఉన్న స్మగ్లర్లు

తిరుపతి మంగళం : ఎర్ర చందనం అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు స్మగ్లర్లను శుక్రవారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీలు ఎండీ షరీఫ్, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ టీ. విష్ణువర్ధన్ కుమార్ బృందం స్థానిక ఎఫ్‌బీఓ కె.వేణుగోపాల్‌తో కలిసి శుక్రవారం కూంబింగ్ చేపట్టారు. సత్యవేడు అటవీ ప్రాంతంలో తెల్లవారుజామున జంబుకేశ్వరపురం నీలగిరి తోట వద్ద రెండు మోటారు సైకిళ్లతో కొంత మంది వ్యక్తులు కనిపించగా వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా వారిలో కొందరు పారిపోయారన్నారు. అయితే ముగ్గురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారు సమీపంలో దాచిన 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒకరు తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తి కాగా, మరో ఇద్దరు తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. వారిని దుంగలతో సహా తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండో రోజు కొనసాగిన ఫుడ్ సేఫ్టీ దాడులు

- 17 బృందాలు, 35 స్వీట్స్ అండ్ బేకరీల్లో శాంపిల్స్ సేకరణ



తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

తిరుపతి క్రైమ్/ తిరుపతి తుడా : నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, తూనికలు, కొలతల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం స్వీట్ షాపులపై మెరుపు దాడులు నిర్వహించారు. జాయింట్ ఫుడ్ సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 17 బృందాలుగా అధికారులు విడిపోయి.. నగరంలోని 35 స్వీట్స్ అండ్ బేకరీస్‌లో తనిఖీలు నిర్వహించారు. వివిధ రకాల తినుబండారాల శాంపిల్స్ సేకరించారు. వీటిని లాబొరేటరీకి తరలించి వచ్చే రిజల్ట్‌ను బట్టి చర్యలు ఉంటాయని తెలిపారు. చాలా చోట్ల స్వీట్లు అన్నీ కూడా నిబంధనలకు వ్యతిరేకంగా కనిపించడంతో వారందరికీ నోటీసులు జారీ చేశారు. నిలువ ఉంచిన పాడైపోయిన 75 కేజీల ఆహార పదార్థాలను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో వివిధ జిల్లాల నుంచి ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార భద్రత, కల్తీ నియంత్రణ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి



గాయపడిన మస్తానయ్యను పరామర్శిస్తున్న మహేంద్రరెడ్డి తదితరులు

చిల్లకూరు : గూడూరు మండలం కాంద్ర గ్రామంలో పాత కక్షలను మనస్సులో పెట్టుకొని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు శుక్రవారం రాత్రి దాడికి పాల్పడి గాయపరిచినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఊటుకూరు మహేంద్రరెడ్డి తెలిపారు. గాయపడిన వ్యక్తి గూడూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంద్ర గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు రాజశేఖర్ ఇంటిపైకి టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఆ సమయంలో రాజశేఖర్ అక్కడ లేకపోవడంతో అతడి తండ్రి మస్తానయ్యపై దాడికి పాల్పడడంతో అతడికి గాయాలైనట్లు చెప్పారు. గాయాలపాలైన అతడిని చుట్టు పక్కల వారు ఆసుపత్రికి తరలించారన్నారు. అలాగే రాజశేఖర్‌కు చెందిన తోట వద్దకు వెళ్లి అక్కడ ఉన్న విద్యుత్ మోటార్‌కు చెందిన వైర్లు, స్టార్లర్లు ధ్వంసం చేశారని తెలిపారు. ఈ మేరకు రూరల్ పోలీసులకు జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశామని తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థిని అదృశ్యంపై కేసు

చంద్రగిరి : చంద్రగిరిలోని ఓ పాఠశాలలో చదువుతున్న బాలిక అదృశ్యం కావడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందని బాలిక చంద్రగిరిలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. గురువారం పాఠశాలకు వెళ్లిన బాలిక, సాయంత్రం తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడ్డారు. దీంతో ఆమె ఆచూకీ కోసం గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హోటల్, బేకరీలపై దాడులు



ఎఫ్‌బీ ఫుడ్స్‌కి తాత్కాలికంగా మూత వేయిస్తున్న అధికారులు

రేణిగుంట : మండల కేంద్రంలోని ఓ బేకరీ, చెర్రీస్ మినీ పరిశ్రమపై శుక్రవారం ఫుడ్ సేఫ్టీ, తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు చేశారు. ముందుగా బేకరీనీ తనిఖీ చేసిన అధికారులు తీవ్ర అసహనానికి గురయ్యారు. పదార్థాలలో వాడే రసాయనాలతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. పరీక్షల నిమిత్తం శాంపిల్స్ తీసుకెళ్లారు. అనంతరం పారిశ్రామిక వాడలోని చెర్రీస్ మినీ పరిశ్రమను పరిశీలించి నమూనాలను సేకరించారు. ఫుడ్ సేఫ్టీ, తూనికల కొలతల శాఖ జాయింట్ కమిషనర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. బేకరీ పదార్థాలు తయారు చేసే పరిశ్రమ నిర్వాహకులు లైసెన్స్ రెన్యూవల్ చేసుకోలేదన్నారు. ప్రమాదకరమైన కలర్, కెమికల్స్‌ను తినుబండారాలలో వాడుతున్నారని తెలిపారు. అన్ని శాంపిల్స్ సేకరించామని నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. అంత వరకు బేకరీని తాత్కాలికంగా మూత వేయిస్తున్నామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించకుండా ఎవరైనా హోటల్, బేకరీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో జాయింట్ కంట్రోలర్ సుధాకర్, డిప్యూటీ కంట్రోలర్ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి పాల్గొన్నారు.

ఉచిత విద్య.. మిథ్య

- ఆరంభ శూరత్వమేనా?
- ప్రైవేటు పాఠశాలలో ఉచిత అడ్మిషన్లు అరకొరే
- మాటవినని ప్రైవేట్ యాజమాన్యం
- చేతులెత్తేసిన విద్యాశాఖ అధికారులు
- మూడో విడత అంటూ ప్రభుత్వం గారడీ

తిరుపతి సిటీ : నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రైవేటు పాఠశాలలో అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులతో కూటమి సర్కారు వారి భవిష్యత్తుతో ఆటలాడుతోంది. పేద పిల్లలకు ప్రైవేట్ తమ కార్పొరేట్ పాఠశాలలో ప్రవేశాలను ఆశ చూపి చేతులెత్తేసింది. ఇప్పటికే రెండు విడతల అడ్మిషన్లు పూర్తయ్యాయని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం వాస్తవ గణాంకాలను చూస్తే విస్తుపోవాల్సిందే.!

జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ విషయంపై పట్టించుకున్న పాపాన పోలేదు. తమ మాట ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల యాజమాన్యాలు వినడం లేదని, తమకు ఏం చేయాలో అర్థం కావడంలేదని అధికారులు మదనపడుతున్నారు.

మాట వినని ప్రైవేటు యాజమాన్యాలు

జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలో కనీసం (ఆర్టీఈ) కింద పేద విద్యార్థుల అడ్మిషన్లు 2శాతం మించలేదంటే అతిశయోక్తి కాదు. జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు పలుమార్లు ప్రైవేటు యాజమాన్యాలతో జరిపిన చర్చలు పూర్తి స్థాయిలో విఫలమయ్యాయి. ఈ ప్రతిపాదనను తాము అంగీకరించమంటూ బహిరంగంగానే అధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి తేల్చి చెబుతున్నారు. ఇప్పటికే అడ్మిషన్లు తక్కువై నష్టాలతో కళాశాలలు, పాఠశాలలు నడుపుతున్నామని ప్రైవేటు యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో ఉచితంగా 25 శాతం అడ్మిషన్లు ప్రభుత్వం తమపై రుద్దడం కక్ష సాధింపులో భాగమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రైవేటు యాజమాన్య సంస్థలు రాష్ట్రస్థాయి అధికారులతోనూ ప్రజాప్రతినిధులతోనూ చర్చించినట్లు తెలుస్తోంది.



తల్లికి వందనం డబ్బులు కట్టాల్సిందే..

మూడో విడత అడ్మిషన్‌లో భాగంగా (ఆర్టీఈ) కింద ప్రైవేటు పాఠశాలలలో అడ్మిషన్లు పొందే విద్యార్థులు తల్లికి వందనం కింద ప్రభుత్వం చెల్లించిన సొమ్మును ఆ పాఠశాలలకు చెల్లించాల్సిందేనంటూ ఆ ఉత్తర్వులులో ప్రభుత్వం పేర్కొన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం కల్పించిన ఉచిత ప్రవేశాలపై మొగ్గు చూపడం లేదు. ఇటు తల్లిదండ్రులు-అటు ప్రైవేటు పాఠశాలలు యాజమాన్యం అధికారుల సూచనలు పాటించకపోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఏమి చేయలేని దుస్థితిలో తలలు పట్టుకుంటున్నారు. మూడో విడత అడ్మిషన్లను ప్రైవేటు పాఠశాలలు కనీసం ఒక శాతం సైతం ఇచ్చే పరిస్థితుల్లో లేవని అధికారులు గుసగుసలాడుకుంటున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు అధికారులను బెంబేలెత్తిస్తోంది.

ముందస్తుగా ఆదేశాలు జారీ చేసినా..

రాష్ట్ర ప్రభుత్వం (ఆర్టీఈ) ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25శాతం పేద విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని మే నెల నుంచి జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి పలు విడతలుగా విద్యాశాఖ అధికారులు ప్రైవేటు కళాశాలల యాజమాన్యంతో చర్చలు జరిపినా కనీసం రెండు శాతం అడ్మిషన్లూ చేయలేకపోయారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ జూన్ 12న ప్రారంభమైన ఆ నెలలో కనీసం ఒక్క శాతం కూడా ప్రవేశాలు చేయలేకపోవడం గమనార్హం. అనంతరం రెండో విడత జులై నెలలో ప్రారంభమైనా... రెండు శాతానికి సైతం చేరుకోలేకపోయారు. దీంతో ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయలేక జిల్లా విద్యాశాఖ యంత్రాంగం చేతులెత్తేసింది.

జిల్లా సమాచారం
జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు - 689
ఇప్పటి వరకు ఆర్టీఈ కింద జరిగిన అడ్మిషన్ల శాతం 2 శాతం
జీరో శాతం అడ్మిషన్ ఇచ్చిన ప్రైవేటు సంస్థల సంఖ్య- 601
మూడో విడతకు సంసిద్ధత తెలిపిన ప్రైవేటు పాఠశాలలు- 0

మూడో విడత అంటూ హంగామా

ఆర్టీఈ కింద పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలలో అడ్మిషన్లు అంటూ హంగామా చేసి రెండు నెలలు గడుస్తున్నా ఆ స్థాయిలో అడ్మిషన్లు జరగకపోవడంతో ప్రభుత్వం మరో ఎత్తుగడకు తెరతీసింది. ఇందులో భాగంగా ఐదు రోజుల క్రితం మూడో విడత అడ్మిషన్లు అంటూ ప్రత్యేక జీవో జారీ చేసింది. జిల్లాస్థాయి అధికారులు మూడో విడత అడ్మిషన్లను వందశాతం పూర్తి చేయాలని టార్గెట్ ఇచ్చింది. ఇందులో మరో మెలిక పెట్టింది.. ఆర్టీఈ కింద విద్యార్థుల గృహాలకు 3 కిలోమీటర్ల పరిధి నుంచి 5 కిలోమీటర్లు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంకా ఎటువంటి ఆదేశాలు అందలేదు

ప్రైవేటు పాఠశాలలలో ఆర్టీఈ కింద మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఎటువంటి స్పష్టమైన ఆదేశాలు అందలేదు. అందిన వెంటనే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో సంప్రదించి అడ్మిషన్ల ప్రక్రియపై ముందడుగు వేస్తాం. ప్రభుత్వ ఆదేశాలను దిక్కరించిన ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకునే దానికి వెనుకాడం – కేవీఎం కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, తిరుపతి

నేడు మహతిలో పౌరాణిక, సాంఘిక నాటికల ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న కోనేటి సుబ్బరాజు

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో శనివారం పౌరాణిక, సాంఘిక నాటికల ప్రదర్శనలకు కళాకారులు, కళాభిమానులు, ప్రజలు హాజరై వీక్షించాలని సుబ్బరాజు నాట్య కళా పరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు పిలుపునిచ్చారు. ప్రకాశం రోడ్డులోని ఆ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నాటక తరంగానికి పూర్వవైభవం తేవాలనే సంకల్పంతో అధునాతన హంగులతో కూడిన సెట్టింగ్స్‌తో నాటకాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో మహతిలో శనివారం సాయంత్రం 4.30 గంటలకు 'అహో..ఆంధ్రభోజ' పద్య నాటకం, రాత్రి 8 గంటలకు విశాఖ భద్రం ఫౌండేషన్ సమర్పణలో ' దొందూ... దొందే' సాంఘిక నాటిక ప్రదర్శించనున్నట్టు తెలియజేశారు. సమావేశంలో పరిషత్ ఉపాధ్యక్షులు ఆమూరి సుబ్రమణ్యం, కె.రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శులు చంద్రబాబు, మేకల గంగయ్య, కోశాధికారి బి.గోపాల్, హారిక, కేశవులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు యువకుల అరెస్టు

- 33 ప్యాకెట్ల గంజాయి పట్టివేత
- కొనసాగుతున్న దర్యాప్తు

చిల్లకూరు : గూడూరు పట్టణంలో సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో పోలీసులు విచారణ అనంతరం ఇద్దరు యువకులను శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు తెలిపారు. గూడూరు పట్టణంలోని ఆసుపత్రి రోడ్డులోని ఓ మెడికల్ షాపునకు పక్కనే ఉన్న సందులో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు మూడు రోజులు క్రితం అనుమానంతో పోలీసులు దాడులు చేసి కొన్ని ప్యాకెట్లు పట్టుకున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి పోలీసులు వాటిని పరీక్షించిన అనంతరం గంజాయిగా గుర్తించారు. దీంతో విచారణలో భాగంగా శుక్రవారం గంజాయిని విక్రయించే గూడూరు మాయాబజార్‌కు చెందిన పాశెపు హనుమంతు, గమళ్లపాళెంకు చెందిన పర్వతాల గణేష్ అనే యువకులను గుర్తించి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద 33 చిన్న ప్యాకెట్లు ఉన్నాయన్నారు. ఈ గంజాయి విక్రయించే వారు ఇంకా ఈ కేసులో పట్టణానికే చెందిన నయీం అనే యువకుడితో పాటుగా మరి కొంత మంది ఉన్నారని వీరిని కూడా అరెస్టు చేసేందుకు దర్యాప్తు వేగవంతం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ తిరుపతయ్య ఉన్నారు.

జెడ్పీటీసీ సభ్యురాలికి కన్నీటి వీడ్కోలు

- ఆమె భర్తను ఓదార్చిన జెడ్పీ చైర్మన్



రాజేశ్వరి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ దంపతులు

డక్కిలి : డక్కిలి వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి అంతిమ యాత్ర అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, బంధువుల మధ్య శుక్రవారం ఆమె భర్త రామ్‌ప్రసాద్‌రెడ్డి స్వగ్రామం చాపలపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు వెంకటగిరి, రాపూరు, బాలాయపల్లి, సైదాపురం మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు చాపలపల్లికి చేరుకుని రాజేశ్వరి భౌతిక కాయానికి నివాళులర్పించారు.

నివాళి అర్పించిన జెడ్పీ చైర్మన్ దంపతులు

డక్కిలి జెడ్పీటీసీ కలిమిలి రాజేశ్వరి భౌతిక కాయాన్ని శుక్రవారం నెల్లూరు జెడ్పీ చైర్మన్ ఆనం అరుణమ్మ , విజయకుమార్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆమె భర్త రామ్‌ప్రసాద్ రెడ్డిని ఓదార్చారు.

పలువురు పరామర్శ

జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందడంతో చాపలపల్లి గ్రామంలో ఆమె భర్త కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డిని పార్టీలకతీతంగా పలువురు ఓదార్చారు. పరామర్శించిన వారిలో డక్కిలి, బాలాయపల్లి, రాపూరు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు , నేతలు పాల్గొన్నారు.

కలిమిలి రాజేశ్వరికి నివాళి

వెంకటగిరి రూరల్ : డక్కిలి మండల జడ్పీటీసీ సభ్యురాలి రాజేశ్వరి మృతదేహానికి శుక్రవారం పలువురు నేతలు నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్నేటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి రాజేశ్వరి మృతదేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె భర్త రాంప్రసాద్‌రెడ్డిని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అదేవిధంగా వెవైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, వెంకటగిరి రూరల్ మండల, డక్కిలి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, బాలాయపల్లి, డక్కిలి మండల ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, గోను రాజశేఖర్, మున్సిపల్ వైస్‌చైర్మన్ సేతరాసిబాలయ్య, జిల్లా సంయుక్త సహాయకార్యదర్శి చిట్టేటి హరికృష్ణతో పాటు వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు నివాళి అర్పించారు.



రాజేశ్వరికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి



శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానము
సూళ్ళూరుపేట పట్టణము & మండలం, తిరుపతి జిల్లా.
సెల్ : 9281180899

సీల్డు టెండర్ల ప్రకటన

తిరుపతి జిల్లా, సూళ్ళూరుపేటలో వేంచేసియున్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానము నందు తేది 22-09-2025 నుండి 02-10-2025 వరకు జరుగు శరన్నవరాత్రులు ఉత్సవములకు ఈ క్రింది తెలిపిన వివిధ ఐటములకు సీల్డుటెండర్లు కోరబడుచున్నవి. తేది 09-08-2025 నుండి 21-08-2025 వరకు దేవస్థానం కార్యాలయము నందు రూ॥ 500/- చెల్లించి టెండరు షెడ్యూలు పొందవలెను. సీల్డుటెండర్లు దాఖలకు ది. 21-08-2025 సాయంత్రం 5.00 గం॥ల వరకు అనుమతించబడును. తేది 22-08-2025 సాయంత్రం 5.00 గం॥లకు సీల్డుటెండర్లు హాజరు అయిన టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరవబడును.

వ.నెం.	వివరములు	దరావత్తు రూ.	కాలపరిమితి
1	పుష్పం సరఫరా చేయుటకు	10,000/-	తేది 22-09-2025 నుండి 02-10-2025 వరకు (11 రోజులు)
2	విద్యుత్ దీపాలంకరణ చేయుటకు	10,000/-	
3	షేడ్లు, షామియానాలు వేయుటకు	10,000/-	
4	అమ్మవారికి అలంకారం చేయుటకు	5,000/-	
5	గ్రామోత్సవమునకు బాణాసంచా సరఫరా చేయుటకు	10,000/-	
6	సాంస్కృ కార్యక్రమమునకు తెప్పెట్లు సరఫరా చేయుటకు	5,000/-	

గమనిక : ఆధార్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్ జతపరచి టెండర్లు వేయవలెను.
తేది 09-08-2025
సూళ్ళూరుపేట
ఇట్లు, సహాయ కమీషనరు & కార్యనిర్వహణాధికారి

అక్రమంగా తరలిస్తున్న చేపల వాహనం పట్టివేత



గ్రామస్తులు అడ్డుకున్న బొలెరో వాహనం

కలువాయి (సైదాపురం) : కండలేరులో రాత్రివేళ అక్రమంగా చేపలు వేట సాగించి దాదాపు 500 కేజీల చేపలు తరలిస్తున్న బొలెరో వాహనాన్ని దాచూరు మత్స్యకారులు అడ్డుకున్నారు. చేపలు గుడ్డు దశలో ఉండడం వల్ల జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు చేపల వేటను మత్స్యశాఖ అధికారులు నిషేధించింది. రాత్రి వేళల్లో అక్రమంగా వేట సాగించి బొలెరో వాహనంలో చేపలు అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో స్థానిక మత్స్యకారులు అడ్డగించి ఏడీ చాంద్‌బాషాకు జరిగిన సంఘటనను స్థానిక మత్స్యకారులు తెలియజేశారు. అయితే ఏడీ స్పందించి వెంటనే పట్టుకున్న ప్రదేశంలో చేపలను మత్స్యశాఖ అధికారి సురేష్ ద్వారా వేలంపాట నిర్వహించారు. 12 వేలకు అదే గ్రామానికి చెందిన మత్స్యకారుల పాట పాడుకున్నారు. నిషేధిత సమయంలో ఎవరైనా చేపలు వేట సాగిస్తే చర్యలు తప్పవని ఏడీ చాంద్ బాషా తెలిపారు.

వైఎస్సార్‌సీపీ యువ నేత మృతి



ముంగమూరు శరత్ (ఫైల్)

వాకాడు : మండలంలోని దుగ్గరాజపట్నం కొత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముంగమూరు శరత్ (41) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాజకీయ విశ్లేషకుడు కొవడలూరు దామోదర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

- 2 లక్షల విలువ చేసే బంగారు నగలు, నగదు చోరీ

నాగలాపురం : పెళ్లికి వెళ్లి తిరిగీ ఇంటికి వచ్చే సరికి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు పడి బంగారు నగలు, నగదు అపహరించిన ఘటన మండలంలోని సుబ్బనాయుడు కండ్రిగలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని సుబ్బనాయుడు కండ్రిగ హైవే పక్కన ఉన్న రమేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం వెంకటగిరిలోని వివాహ కార్యక్రమానికి వెళ్లారు. వారు తిరిగీ గురువారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. రాగానే తలుపు, గేట్లు పగులకొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం ఎస్ఐ సునీల్ క్లూస్ టీం ద్వారా సంఘటనా స్థలాన్ని పూర్తిగా పరిశీలించి వివరాలను సేకరించారు. బాధితుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 18 గ్రాములు డైమండ్ గాజులు, 16 గ్రాముల బంగారు చైను, 8 గ్రాముల ఉంగరం, నగదు 10 వేలు, చోరీకి గురైనట్లు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని త్వరలోనే దుండగులను పట్టుకుంటామని ఎస్ఐ సునీల్ తెలిపారు. ఆయనతో పాటు శిక్షణ ఎస్ఐ ప్రసాద్, కానిస్టేబుల్ నటరాజ్, నరేష్ ఉన్నారు.

రెచ్చిపోతున్న జన సైనికులు

- చోటా లీడర్ల ఇష్టారాజ్యం
- పెచ్చుమీరుతున్న దౌర్జన్యం
- ప్రతిపక్ష పార్టీ నాయకులే లక్ష్యం
- బహిరంగంగానే దాడులకు యత్నం



సాక్షి టాస్క్‌ఫోర్స్ : జనసైనికుల రౌడీయిజానికి అంతే లేకుండా పోతోంది. వారే రౌడీయిజం చేసి మరొకరిపైకి నెట్టేస్తున్నారు. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట పరిసర ప్రాంతాల్లో ఇటీవల చోటు చేసుకుంటున్న సంఘటనలే ఇందుకు నిదర్శనం.

జనసేన పార్టీలోని కొందరు పెద్దల ప్రోత్సాహంతో తిరుపతిలో చోటా లీడర్లు హద్దులు మీరి రౌడీయిజం ప్రదర్శిస్తున్నారనే అంశం బాహాటంగా కనిపిస్తోంది. ప్రతిపక్ష పార్టీ నాయకులే లక్ష్యం చేసుకుని హెచ్చుమీరి దౌర్జన్యకాండకు దిగుతున్నారు.

తాజాగా గురువారం తిరుపతిలో జనసేన పార్టీకి సంబంధించిన చోటా నాయకుడు దినేష్ ఓ గిరిజన యువకుడిపై దాడికి పాల్పడిన ఘటన సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. బెడిసికొట్టిన కూటమి వ్యూహం..పులిచెర్ల మండలానికి చెందిన పవన్ అనే గిరిజన యువకుడిపై జరిగిన దాడిని తెలివిగా కూటమి నేతలు తమ అనుకూల మీడియా ద్వారా నానా యాగి చేసి ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డిపైకి నెట్టేశారు. పోలీసులు కూడా తానా తందానా అంటూ వంతపాడారు. దాడి చేసిందెవరు, ఎందుకు చేశారనే పూర్వాపరాలు తెలుసుకోకుండానే బహిరంగ ఆరోపణలు చేశారు.

అనుకున్నది ఒకటి..జరిగింది.. మరొకటి

గిరిజన యువకుడు పవన్‌పై జనసేన చోటా నాయకుడు దినేష్ పోలీసులు ఉపయోగించే ఫైబర్ లాఠీ చేతపట్టి చితకబాదిన వీడియో సోషల్ మీడియాలో నెట్టింట వైరల్ కావడంతో అది పరిశీలించిన కూటమి నేతలు ఖంగుతిన్నారు. ఏదో అనుకుంటే మరేదో జరిగిందని సాయంత్రానికి ఏమి తెలియనట్లు వ్యవహరించిన తీరుతో వారి బండారం వెలుగుచూసింది.

ఆర్థిక లావాదేవీల వివాదం...

బాధితుడు పవన్, జనసేన చోటా నాయకుడు దినేష్ మధ్య ఆర్థిక లావాదేవీల వివాదం తీవ్ర తరం కావడంతోనే దాడికి దారి తీసిందనే విషయాలు వెలుగు చూశాయి. కాగా వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి టూవీలర్ రెంటల్ బిజినెస్ చేస్తున్నాడు. ఈ క్రమంలో పులిచెర్లకు చెందిన పవన్ టూవీలర్ రెంట్‌కు తీసుకుని నెలలు గడచినా కనిపించలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పవన్ అనిల్‌రెడ్డి కార్యాలయానికి చేరుకుని బైక్ డబ్బులు పూర్తిగా చెల్లిస్తానని చెప్పుకొచ్చాడు. పవన్ వచ్చిన విషయం తెలుసుకున్న జనసేన కార్యాకర్త దినేష్ అనుచరులతో కలిసి అనిల్‌రెడ్డి కార్యాలయానికి చేరుకున్నారు. పవన్ ఉద్యోగాలు ఇప్పిస్తానని, శ్రీవారి దర్శనాలు చేయిస్తానని డబ్బులు వసూళ్లు చేసుకుని పారిపోయాడని, ఇన్నాళ్లకు చిక్కాడని పవన్‌పై దాడికి తెగబడ్డారు. అనిల్‌రెడ్డి స్పందించి కొట్టొద్దని దినేష్ తెచ్చుకున్న లాఠీని పట్టుకున్నారు. పట్టుకున్న వీడియోని కట్‌చేసి అనిల్‌రెడ్డే దాడిచేశారని ఎల్లో మీడియా దుష్ప్రచారం చేసింది. కొట్టకుండా అడ్డుకున్న వ్యక్తిపై కేసుపెట్టి జైలుకు పంపిన ఘనత తిరుపతి కూటమి నేతలకే దక్కింది. పూర్వాపరాలు విచారించకుండా పోలీసులు కూడా కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అనిల్‌రెడ్డిపై కేసునమోదు చేసి జైలుకు పంపించారు.

హెచ్చుమీరిన దౌర్జన్యాలు ఇలా..

ఇటీవల తిరుపతి, రేణిగుంట పరిధిలో జనసేనకు సంబంధించిన కొందరు బడా, చోటా నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. తిరుపతి నగరంలో జనసేన పార్టీకి చెందిన కొందరు చోటా లీడర్లు చిరు వ్యాపారులపై పడ్డారు. కమిషన్లు ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తూ ప్రశ్నించే వారిపై దౌర్జన్యాలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. ఆరు నెలల కిందట బైరాగి పట్టెడ బాబు జగజ్జీవన్ పార్కు సమీపంలో చిరు వ్యాపారుల నుంచి కమీషన్ల తీసుకునే క్రమంలో ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న వివాదంలో కమ్యూనిస్టుల జోక్యం అనివార్యమైంది. అలాగే మంగళం రోడ్డులోని బొంతాలమ్మ గుడి సమీపంలోని చిరు వ్యాపారులు కమీషన్లు చెల్లించాలనే నిబంధనపై ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న వివాదం తార స్థాయికి చేరి ఘర్షణకు దారితీసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అందరికి తెలిసి కొన్ని అయితే తెలియకుండా ఇలాంటి ఘటనలు మరెన్నో చోటుకుంటున్నా బాహాటంగా చెప్పుకోలేని స్థితిలో కొందరు ఉన్నారు.

రేణిగుంటలో బడా నాయకుల బరితెగింపు

నెల రోజుల కిందట రేణిగుంటలో జనసేన బడా నాయకుల బరి తెగింపునకు ఏకంగా ఓ యువకుడు ప్రాణం కోల్పోయాడు. గత నెల 7న జనసేన శ్రీకాళహస్తి ఇంచార్జ్ వినూత డ్రైవర్ శ్రీనివాస అలియాస్ రాయుడు హత్య జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి చెన్నై పోలీసుల విచారణలో 5 మంది అరెస్టు అయ్యారు. వీరిలో కోట చంద్రశేఖర్, షేక్ తాసర్, కోట వినుత, శివకుమార్, గోపి ఉన్నారు. ఇలా తిరుపతి జిల్లా పరిధిలోని ప్రధాన పట్టణాల్లో జనసేన శ్రేణులు రెచ్చిపోతున్నారు. అటువంటి వారిపై దృష్టి సారించాల్సిన పోలీసులు సంబంధం లేని వ్యక్తులపై కేసులు నమోదు చేయడాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు.

హాస్టళ్లలో మంత్రి తనిఖీ

తిరుపతి అర్బన్: హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం సరైన భోజన వసతులు కల్పించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆయన తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని ఓ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనంతో పాటు విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. హాస్టళ్ల మరమ్మతులకు మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. ఆయనతోపాటు ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి విక్రమకుమార్‌రెడ్డి, గురుకుల స్కూల్ అండ్ కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ పద్మజ, పలువురు వార్డెన్లు ఉన్నారు.

బస్సు షెల్టర్ కూల్చివేత.. టీడీపీ నేతలపై కేసు

చంద్రగిరి : బస్సు షెల్టర్‌ను కూలదోశారని అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని తొండవాడ ప్రవేశ మార్గంలో రెండు రోజుల క్రితం కొంత మంది బస్సు షెల్టర్‌ను కూలదోశారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఏఈ అజిత్ కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో తొండవాడ పంచాయతీ మాజీ అధ్యక్షుడు విజయ్ భాస్కర్ రెడ్డి, మండపంపల్లికి చెందిన టీడీపీ నేత బోడిరెడ్డి చెంగారెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడితో పాటు హిటాచీ, లారీ డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. అయితే ఫిర్యాదు చేసిన అధికారులకు వద్ద ఎలాంటి పత్రాలు లేకపోయినా తప్పుడు ఫిర్యాదు చేయడం ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. అయితే ముందుగా వైఎస్సార్‌సీపీ నాయకులు బస్సు షెల్టర్‌ను కూలదోశారంటూ తప్పుడు ప్రచారానికి కూటమి నేతలు పాల్పడ్డారు. అయితే ఈ ఘాతుకానికి పాల్పడిన ప్రధాన నిందితులుగా టీడీపీ నాయకులపై కేసు నమోదు కావడంతో గొంతులో వెలక్కాయ పడ్డట్టు తయారైంది.